
# చికిత్స

హాస్పిటల్ బెంచీ మీద కూర్చుని ఉన్నాడు జగదీశ్వరరావు. స్నేహితుడు, డాక్టరు అయిన వేదాచలం చెప్పిన మాటలే ఆయన మనసులో కదులుతున్నాయి. 'ఒరే! చెల్లమ్మని ఈలోకంలోకి తేవడానికి ఇక మందులు పనిచేయవని అర్థమయింది. ఇక ఒక్కటే మార్గం. అది నువ్వు ఇంట్లో నీ మిలటరీ క్రమశిక్షణ మాని చెల్లమ్మతో సరదాగా వుంటానని చెప్పడమే. అది ఆవిడని పునర్జీవింపజేస్తుంది. కొత్త ఆశలు, కోరికలు మృత్యుముఖం నుంచి బయటపడేయొచ్చు ఆ తర్వాత నీఇష్టం!' అన్నాడు.



జగదీశ్వరరావు చెప్పిందే ఆ ఇంట్లో వేదం. ఎప్పుడూ జమదగ్నిలా మొటమొటలాడుతూ ఉంటాడు. ఇంట్లో ఎవరికీ ఏ రకమైన అభిరుచులు ఉండకూడదు. లేవుకూడా!

భార్యని బతికించుకోవాలంటే ఇప్పుడు జగదీశ్వరరావు తన వైఖరిలో మార్పు తెచ్చుకోవాలి. భార్య లేని ఇంటిని, ఊహించుకోలేకపోయాడు. వెంటనే వెళ్ళి, భార్య చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా "ఇన్నాళ్లూ అనవసర క్రమశిక్షణతో ప్రేమ స్థానంలో భయాన్ని నింపి అది గౌరవంగా భావించాను. నువ్వెంత నలిగిపోయావో? అర్థం చేసుకున్నా. ఇప్పుడు ఈ వృద్ధాప్యంలో మనం కొత్త దంపతులమవుదాం! ఆనందంగా గడుపుదాం!" అన్నాడు.

వాస్తవానికి ఆవిడకి ఎటువంటి ప్రాణాపాయం లేదని, తనలో మార్పు రావడానికే డాక్టరు అలా చెప్పాడని జగదీశ్వరరావుకు తెలియదు. భార్యకి, ఆయనకీ ఒకేసారి చికిత్స చేశాడు, శ్రేయోభిలాషి అయిన ఆ డాక్టరు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సైనిక్‌పురి, సికింద్రాబాద్



# బతక నేర్చిన భర్త

రామారావుగారి షష్టిపూర్తి. ఇల్లంతా కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, చుట్టాలు, స్నేహితులతో కళకళలాడుతోంది.

ఆ రోజు సాయంత్రం షామియానా కింద కూర్చుని ఉండగా అందరూ కలిసి ముక్తకంఠంతో ఒకే ఒక ప్రశ్న వేశారు. రామారావుగారి వైవాహిక జీవిత సాఫల్యానికి కారణమేమిటి?

దానికాయన నవ్వుతూ "భర్త ఎంత విద్యాపారంగతుడైనా, గొప్పవాడైనా భార్య



సహకారం ఉంటేనే సంసార సాగరాన్ని సులభంగా ఈదగలడని మా పెళ్ళైన కొత్తల్లోనే తెలుసుకున్నాను. నేను కవిగా లబ్ధప్రతిష్ఠుడినని మీకు తెలుసు. అందుకే నా భార్య గుణగణాల్ని, ఆమె పుట్టింటి గొప్పతనాన్ని ఉటంకిస్తూ ఓ వంద కవితలు రాసి, అచ్చేయించి మా ఆవిడకి అంకితమిచ్చాను. అంతే ఎటువంటి చీకూచింతా లేకుండా మా వైవాహిక జీవితం నల్లేరు మీద బండి నడకలా హాయిగా సాగిపోయింది" అన్నారు.

పక్కనే కూర్చున్న ఆయన భార్య ముఖం కాస్త సిగ్గు, మరికాస్త కోపంతో అరుణిమ దాల్చింది.

– ప్రతాప వెంకట సుబ్బరాయుడు,
సికింద్రాబాద్